

ఒక్క మాత్రతో 'నులి'పేద్దాం

చిన్నారులను అనారోగ్య సమస్యలను కలిగించే వాటిలో నులిపురుగులు ప్రధానమైనవి. వాటికి చెక్ పెట్టేందుకు మంగళవారం నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ జరగనుంది.

8లో▸



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళా వేదికపై సోమవారం కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన నాట్యార్చన కళాట్రస్ట్ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,632
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 18,737
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	: 18,137

న్యూస్‌రీల్

అన్నప్రసాద వితరణకు రూ. 5 లక్షల విరాళం



దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు వరంగల్‌కు చెందిన ఐదుగురు విరాళాలిచ్చారు. గుండా అన్నపూర్ణమ్మ, గోలి ఉమామహేశ్వరరావు, గోలి జయలక్ష్మి, గోలి మల్లికార్జున, గోలి జగదీశ్వరరావు తలా రూ.1,00,116 చొప్పున మొత్తం రూ.5,00,580 సోమవారం అన్నదానం విభాగం పర్యవేక్షకులు టి. హిమబిందుకు అందించారు. దాతలకు ఆమె రసీదు, ప్రసాదాలు అందించి శేషవస్త్రాలతో సత్కరించారు.

వీబీఆర్‌కు కొనసాగుతున్న నీటి విడుదల

వెలుగోడు: బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు చానల్ ద్వారా వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి 9,200 క్యూసెక్కుల కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నట్లు తెలుగుగంగ ప్రాజెక్టు ఏఈ శివ నాయక్ తెలిపారు. ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గాలేరు నదికి 6,000 క్యూసెక్కులు, మద్రాస్ కాలువకు 5,000, వన్ ఆర్ తూముకు 50 , వన్ ఎల్ తూముకు 30 క్యూసెక్కులు నీటిని పంపుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వీబీఆర్‌లో సోమవారం 14.445 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ వివరించారు.

ముగిసిన గణపతి నవరాత్రోత్సవాలు

- మృత్తికా గణపతికి నిమజ్జనం



గణపతి నవరాత్రోత్సవాలకు పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: వినాయక చవితిని పురస్కరించుకుని శ్రీశైలంలో ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన గణపతి నవరాత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో భాగంగా అర్చకులు స్వామివారి యాగశాలలో పూర్ణాహుతి జరిపించారు. ముందుగా ఆలయంలోని రత్నగర్భ గణపతి స్వామికి, అలాగే సాక్షిగణపతి స్వామి, మృత్తికా గణపతి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. యాగశాలలో నెలకొల్పిన పంచలోహ వరసిద్ధి వినాయక స్వామికి కూడా విశేష పూజలు నిర్వహించారు. అనంతరం లోక కల్యాణం కోసం జపాలు, నిత్యహోమ బలిహరణలను చేసి గణపతి హోమం, జయాదిహోమం జరిపించారు. తరువాత పూర్ణాహుతి, వసంతోత్సవం, అవబృథం కార్యక్రమాలు చేపట్టారు. పూర్ణాహుతి కార్యక్రమంలో శాస్త్రోక్తంగా నారికేళాలు పలు సుగంధద్రవ్యాలు మొదలైన ద్రవ్యాలను హోమ గుండంలోకి ఆహుతిగా సమర్పించారు. అనంతరం జరిగిన అవబృథంలో వరసిద్ధి వినాయక స్వామి పంచలోహమూర్తికి ఆలయ ప్రాంగణంలోని మల్లికాగుండంలో వైదిక శాస్త్రోక్తంగా స్నపన కార్యక్రమం నిర్వహించారు. గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా సాక్షి గణపతి ఆలయంలో నెలకొల్పిన మృత్తికా గణపతి విగ్రహాన్ని సోమవారం లింగాలగట్టు వద్ద పాతాళగంగలో నిమజ్జనం చేశారు.

నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

ఎమ్మిగనూరురూరల్: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 23వ తేదీ వరకు గడవు పొడిగించినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి సోమవారం తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని కర్నూలు, నంద్యాల జిల్లాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొత్త మెడికల్ కళాశాలను పూర్తి చేయాలి



పేదలకు వైద్య విద్య అందని ద్రాక్షగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. పేద విద్యార్థులపై ఈ ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే రాష్ట్రం కొత్తగా నిర్మాణం చేపట్టిన మెడికల్ కళాశాలలకు నిధులు విడుదల చేసి పూర్తి చేసి అడ్మిషన్లు చేపట్టాలి. గతంలో టీడీపీ ప్రభుత్వం తిరుపతి ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేసింది. అదే తరహాలో ఇప్పుడు కూడా ప్రయత్నం చేస్తుండటం దుర్మార్గం. ఎంతో పేద విద్యార్థులు స్థానికంగానే మెడికల్ సీట్లు వస్తాయనే ఆశతో కోర్సులు పూర్తి చేసి సీట్లు సాధించేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వారి భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతుంది. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోకపోతే విద్యార్థి సంఘాల నుంచి ప్రతిఘటన తప్పదు. – **ఉదయ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, నంద్యాల**



విద్యార్థులకు తీవ్ర అన్యాయం



ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే పేద మెరిట్ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. సామాన్య, మధ్యతరగతి మెరిట్ విద్యార్థులు ప్రైవేటు కళాశాలల్లో చదవలేని పరిస్థితి దాపురిస్తుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయకుండా ప్రభుత్వం ఆలోచించాలి. ప్రభుత్వ కాలేజీలు అయితే అన్నీ వసతులు, సౌకర్యాలతో పాటు మంచి ప్రొఫెసర్లు ఉంటారు. వారివద్ద వైద్య విద్యను బాగా నేర్చుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ మెడికల్ కళాశాల అందుబాటులో ఉండటంతో పేదలకు కూడా మెరుగైన వైద్యం అందనుంది. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. అలాంటి ప్రభుత్వం మెడికల్ విద్యను ప్రైవేటు పరం చేయాలని చూడటం దుర్మార్గం. – **మధు శేఖర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, నంద్యాల**

ఇంజినీరింగ్ విద్యార్థుల్లో అవగాహన రాహిత్యం

- సివిల్, మెకానికల్ కోర్సులపై అనాసక్తి
- అందరి దృష్టి కంప్యూటర్ సైన్స్ అనుబంధ కోర్సులపైనే
- 90 శాతం విద్యార్థులు అటువైపే మొగ్గు
- కళాశాలలు సైతం ఆ కోర్సులు వద్దని జేఎన్‌టీయూకు మొర
- నిర్మాణ, పారిశ్రామిక రంగాల్లో నిష్ణాతుల కొరత




ఆర్‌యూలో సీఎస్ఈ విద్యార్థులకు బోధన చేస్తున్న ప్రొఫెసర్

ఆ కోర్సు ఎక్కువేం కాదు.. ఈ కోర్సులేం తీసిపోవు!



కంప్యూటర్ సైన్స్ సీట్లు పెంచుకునేందుకే ఆసక్తి

విద్యార్థుల డిమాండ్ నేపథ్యంలో కళాశాలలు సైతం కంప్యూటర్ సైన్స్, సంబంధిత కోర్సుల్లో సీట్లను పెంచుకోవడానికే మొగ్గు చూపుతున్నాయి. ఈ క్రమంలో మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ సీట్లు తమకు వద్దని జేఎన్‌టీయూకి విన్నవించాయి. సివిల్, మెకానికల్ సీట్ల స్థానంలో ఏఐ, ఐవోటీ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ సంబంధిత సీట్లను పెంచాలని కోరుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ యూనివర్సిటీల క్యాంపస్ ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు ఒకటి, రెండు ప్రముఖ ప్రైవేటు కళాశాలల్లోనే సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ సీట్లు ఓ మాదిరిగా భర్తీ అవుతున్నాయి. ఇవి మినహా అన్ని ప్రైవేటు కళాశాలల్లోనూ, కొత్త ప్రభుత్వ యూనివర్సిటీల్లోనూ ఈ రెండు బ్రాంచ్‌ల్లో సీట్లు భర్తీ కాని పరిస్థితి.



- కర్నూలులోని ప్రభుత్వ విద్యా సంస్థ అయిన రాయలసీమ విశ్వవిద్యాలయంలో 2022లో ఒక సివిల్ సీటు, 2023లో రెండు సివిల్, ఒక మెకానికల్ ఇంజినీరింగ్ సీటు మాత్రమే భర్తీ అయ్యాయి.
- ఇక ఈ ఏడాది సివిల్‌లో 9, మెకానికల్‌లో 2 సీట్లు మాత్రమే భర్తీ కావడం గమనార్హం.

.. ఒక్క రాయలసీమ విశ్వ విద్యాలయమే కాకుండా అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈ రెండు బ్రాంచ్‌ల పరిస్థితి ఇలాగే ఉంది.

సాక్షి ప్రతినిధి కర్నూలు: కోర్సు పూర్తి కాగానే ఉద్యోగం.. అధిక వేతనాలు.. వెరసి ఎక్కువ మంది ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్‌నే ఎంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇతర కోర్ బ్రాంచ్‌లైన సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ ప్రశ్నార్థకమవుతోంది. ఐదారేళ్ల క్రితం వరకు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ), మెకానికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్‌లే కోర్ బ్రాంచ్‌లు. ఇంజనీరింగ్‌లో దాదాపు 20 పైగా బ్రాంచ్‌లున్నా ఎక్కువ మంది విద్యార్థులు ఈ ఐదు బ్రాంచ్‌లనే ఎంచుకునేవారు. అయితే ఇప్పుడు డేటా సైన్స్, రోబోటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ), సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ వంటివి కంప్యూటర్ సైన్స్‌తోపాటు ప్రవేశించాయి. వీటికి ఎక్కువ ఉపాధి అవకాశాలు, వేతనాలు ఉంటాయనే అంచనాల నేపథ్యంలో ఎక్కువ మంది విద్యార్థులు ఇంజనీరింగ్‌లో ఈ కోర్సులనే ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో గతంలో కోర్ బ్రాంచ్‌లుగా వెలుగొందిన సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులు ప్రాభవాన్ని కోల్పోతున్నాయి.

నిపుణులైన ఇంజినీర్లు లభించనట్లే!

సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లను ఎంపిక చేసుకునే విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో భవిష్యత్ అంధకారమవుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలన్నా, వాహన రంగం అభివృద్ధి చెందాలన్నా సివిల్, మెకానికల్ ఇంజనీర్ల అవసరం ఎంతో ఉందనేది వాస్తవం. ఈ కోర్సులు చదివే వారు లేకపోతే భవిష్యత్‌లో ఈ రంగాలకు నిపుణులైన ఇంజనీర్లే లభించరని చెబుతున్నారు. ఇదే జరిగితే నిర్మాణ, మెకానికల్ రంగాలు పెను ప్రమాదంలో పడినట్లేనని ఆందోళన వ్యక్తమవుతోంది.

ఏఐసీటీఈ కూడా కారణమేనా?

సివిల్, మెకానికల్ కోర్సులు ప్రమాదంలో పడేందుకు ప్రధాన కారణం అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) అని నిపుణులు విమర్శిస్తున్నారు. ప్రైవేటు కళాశాలలకు ఇబ్బడిముబ్బడిగా అనుమతులు ఇవ్వడంతో అవి విద్యను వ్యాపారంగా మార్చాయి. భారీ ఎత్తున ఫీజులను దండుకోవడానికి డిమాండ్ ఉన్న కంప్యూటర్ సైన్స్, సంబంధిత కోర్సులను ప్రవేశపెట్టడానికే మొగ్గు చూపాయి. ఈ కోర్సుల సీట్లను ఎక్కువగా పెంచుకునే ప్రయత్నం చేశాయి. దీనికి ఏఐసీటీఈ కూడా వెనుకా ముందు చూసుకోకుండా అనుమతులు ఇచ్చేయడం గమనార్హం.

ఖాళీల భర్తీతోనే మార్పు సాధ్యం

సాగునీటి రంగం, రోడ్లు–భవనాలు, గ్రామీణ తాగునీటి సరఫరా, పంచాయతీరాజ్‌తో పాటు పలు ప్రభుత్వ విభాగాలకు సివిల్, మెకానికల్ ఇంజనీర్ల అవసరం ఎంతో ఉంది. గత 15 ఏళ్లుగా ప్రభుత్వశాఖల్లో ఇంజనీర్ పోస్టులు భర్తీ లేదు. ఏదైనా ప్రాజెక్టుకు డీపీఆర్ కావాలంటే ఔట్‌సోర్సింగ్ ద్వారా చేయించుకుంటున్నారు. అరకొరగా ఉన్న సివిల్, మెకానికల్ ఇంజనీర్లను పెద్ద నిర్మాణ సంస్థలు నియమించుకుంటున్నాయి. ఈ క్రమంలో ఏదైనా ప్రాజెక్టు నిర్మించాలంటే ప్రభుత్వాలు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై ఆధారపడక తప్పని పరిస్థితి. ప్రభుత్వాలు రెగ్యులర్‌గా ఖాళీలను భర్తీ చేస్తే విద్యార్థులు కూడా సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులపై ఆసక్తి చూపుతారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిర్మాణ, పారిశ్రామిక రంగాలకు నిపుణుల కొరత

గత కొన్నేళ్లుగా కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పట్టభద్రులు పెరిగిపోయారు. ఇదే సమయంలో సివిల్, మెకానికల్ వంటి బ్రాంచ్‌ల్లో భారీగా తగ్గిపోయారు. దీంతో నిర్మాణ, మౌలిక రంగాలు, పారిశ్రామిక రంగాలకు అవసరమైన సివిల్, మెకానికల్ ఇంజనీర్ల కొరత పెద్ద ఎత్తున ఏర్పడుతోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మాణ, మౌలిక, పారిశ్రామిక రంగాలకు పెద్ద ఎత్తున నిధులు వ్యయం చేస్తున్నాయి. అయితే డిమాండ్‌కు అనుగుణంగా సివిల్, మెకానికల్‌లో పట్టభద్రులు లేకపోవడంతో ఈ రంగాల్లో నిష్ణాతులైన నిపుణుల కొరత ఏర్పడుతోంది.





ఫైనల్ ఇయర్ సివిల్

ఇదీ పరిష్కారం..

- ➡ డిమాండ్ ఉన్న కోర్సులకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- ➡ ఇదే సమయంలో విద్యార్థులు అన్ని కోర్సులు చదివేలా జాగ్రత్తపడాలి.
- ➡ కౌన్సెలింగ్ సమయంలో కంప్యూటర్ సైన్స్‌తో పాటు ఇతర అన్ని బ్రాంచ్‌లు కలిపి 60–70 శాతం సీట్లు భర్తీ అయ్యేలా ఏఐసీటీఈ చూడాలి.
- ➡ ఆ తర్వాత మాత్రమే తక్కిన 30–40 శాతం సీట్లకు అనుమతి ఇవ్వాలి.
- ➡ ఈ విషయంలో కఠినంగా ఉంటే అన్ని కోర్సుల్లో సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉంది.

భవిష్యత్తు అంధకారమే..



సివిల్, మెకానికల్ కోర్సులు పెను ప్రమాదంలో ఉన్నాయి. వీటిపై ఏఐసీటీఈ ఆలోచించకపోతే భవిష్యత్ అంధకారమే. అన్ని బ్రాంచ్‌లు కలిపితేనే ఇంజినీరింగ్. ఏదైనా ఓ ప్రాజెక్టు, పరిశ్రమ, భవనం, వాహనం తయారు కావాలంటే అన్ని రకాల ఇంజినీర్లు ఉండాలి. కంప్యూటర్ సైన్స్ మాయలో పడి మన భవిష్యత్తును మనమే ప్రమాదంలో పడేసుకుంటున్నాం. ప్రతి కళాశాలలో అన్ని బ్రాంచ్‌ల సీట్లను సమానస్థాయిలో ఉంచాలి. అప్పుడు సీఎస్ఈ సీటు రానివారు ఇతరు కోర్సులు చదువుతారు. అలా కాకుండా డిమాండ్ ఉన్న కోర్సు అనే భ్రమలో పడితే మౌలిక, నిర్మాణ రంగాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. – **హరిప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్, రాయలసీమ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల, కర్నూలు**

23 వరకు పంటల నమోదుకు అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ పంటల నమోదుకు వ్యవసాయ శాఖ ఈ నెల 23 వరకు అవకాశం కల్పించింది. గడువులోపు పంటలను నమోదు చేయడంతో పాటు ఈ–కేవైసీ కూడా పూర్తి చేయాల్సి ఉంది. ఈ నెల 25 నుంచి 27 వరకు గ్రామ స్థాయిలోని రైతు సేవా కేంద్రాల వారీగా గ్రామసభలు నిర్వహించి పంటల నమోదు జాబితాలను సోషల్ ఆడిట్‌కు పెట్టాలి. సోషల్ ఆడిట్‌లో వచ్చిన అభ్యంతరాలను ఈ నెల 28 నుంచి 29 వరకు పరిష్కరిస్తారు. పంటల నమోదు తుది జాబితాలను ఈనెల 30వ తేదీన ప్రకటిస్తారు.

ప్రవక్త బోధనలతో ప్రపంచ శాంతి



మహమ్మద్ ప్రవక్త వినియోగించిన వస్తువులను దర్శించుకుంటున్న ముస్లింలు

నంద్యాల(వ్యవసాయం): మహమ్మద్ ప్రవక్త బోధనలతోనే ప్రపంచంలో శాంతి నెలకొందని పలువురు వక్తలు అన్నారు. సోమవారం మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీ పండగను నంద్యాల పట్టణ ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ర్యాలీ, రక్తదాన శిబిరం, ప్రవక్త వినియోగించిన వస్తువులను ప్రదర్శించారు. స్థానిక చాంద్‌బాడా వీధిలోని సాహెబ్ మసీదులో ఆసారె ముబారక్ నిర్వహించారు. అనంతరం మహమ్మద్ ప్రవక్త వారి తల వెంట్రుకలు, ప్రవక్త వాడిన కంబలి, పవిత్ర మక్కా కిస్వా శారీను ప్రదర్శించారు. వాటిని ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకుని సర్వ మానవాళి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. మంజుబాషా దర్గా నిర్వాకుల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మతపెద్దలు మాట్లాడుతూ మానవాళి శాంతి కోసం అల్లాహ్ పంపిన దూతగా మహమ్మద్ ప్రవక్త ఈ భూలోకానికి వచ్చారన్నారు. గాంధీచౌక్‌లోని గులాబ్ షావలి దర్గా కమిటీ సభ్యులు ముత్తవల్లిల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా 60 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ముత్తవల్లీలు సయ్యద్ గులాబ్, సయ్యద్ షా, సాహెబ్ పాల్గొన్నారు.

నాడు అభివృద్ధి పథం.. నేడు విధ్వంస పర్వం

- పెట్రేగిపోతున్న టీడీపీ నాయకులు
- యథేచ్ఛగా ఆక్రమణలు, విధ్వంసాలు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

డోన్: మూడు నెలల కూటమి ప్రభుత్వంలో టీడీపీ నేతల దురాగతాలు హద్దులు దాటుతున్నాయి. ఎన్నికల్లో ఎన్నో హామీలిచ్చిన నేతలు అన్నింటినీ విస్మరించేశారు. కింది స్థాయి నేతలు యథేచ్ఛగా ఆక్రమణలు, అక్రమాలు, కమీషన్లు పరమావధిగా బరితెగిస్తున్నారు. ప్రజలను భయపెట్టేలా విధ్వంసాలు, దాడులకు తెగబడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిన డోన్ నియోజకవర్గంలో ప్రస్తుతం విధ్వంస పర్వం కొనసాగుతోంది. ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్ నియోజకవర్గానికి రూ.3,500 కోట్లు వెచ్చించి విద్య, వైద్య, ఉపాధి రంగాలలో అభివృద్ధిని పరుగులు పెట్టించారు. తాగు, సాగు నీటి సమస్య పరిష్కారానికి ఎంతో చొరవ చూపారు. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అభివృద్ధిని కొనసాగించాల్సింది పోయి విధ్వంసానికి తెగబడింది. ఒకవైపు ప్రజాధనంతో నిర్మించిన కట్టడాలను ధ్వంసం చేస్తూనే మరోవైపు గ్రామాల్లో రేషన్ షాప్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, బుక్ కీపర్లు, వీఏఓ పోస్టులకు రాజీనామాలు చేయాలని పలువురిని వేధించారు. ఆధిపత్యం కోసం ప్రత్యర్థి పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రశాంతంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో కక్షల కుంపటిని రగిల్చేందుకు కుట్ర పన్నుతున్నారు. ఇటీవల డోన్‌లో జరిగిన ఘటనలు టీడీపీ నేతల ఆగడాలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.



పార్కు స్థలం ఆక్రమణ

పట్టణ శివారులోని ఎస్‌కే, సాక్షి టౌన్‌షిప్‌ల మధ్యలో పార్కు స్థలాన్ని అధికార పార్టీ నాయకులు ఆక్రమించి కొంత భాగాన్ని ప్లాట్లు వేసి విక్రయించారు. వంద అడుగుల రోడ్డు మధ్యలో ప్రహరీని నిర్మించి కుడా నిబంధనలను తుంగలోకి తొక్కారు. సువిశాలమైన రోడ్లు, పార్కులు ఉంటాయని భావించి ఈ రెండు వెంచర్లలో ప్లాట్లు కొన్న వారికి వెంచర్ల నిర్వాహకుల తీరు ఆగ్రహాన్ని కలిగించింది.

ఆర్‌అండ్‌బీ రోడ్డునే తవ్వేశారు



ప్రభుత్వం మాది.. మమ్మల్ని ఎవరూ అడిగేది అనే తరహాలో టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నాడనేందుకు ఇటీవల మండల కేంద్రంలో ప్యాపిలిలో జరిగిన ఘటనే నిదర్శనం. పట్టణ సమీపంలో టీడీపీ నాయకుడు నిర్వహిస్తున్న ఫంక్షన్ హాల్‌కు పైప్‌లైన్ వేసుకునేందుకు ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న కొత్తగా వేసిన రోడ్డును యథేచ్ఛగా తవ్వించాడు. స్థానికుల ఫిర్యాదుతో ఆర్‌అండ్‌బీ అధికారులు అక్కడికి చేరుకుని తవ్విన గుంతను పూడ్చివేయించారు.



అడ్డొచ్చిందని డివైడర్‌ను తొలగించారు

ప్యాపిలి పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు తన వెంచర్‌కు ఎదురుగా ఉన్న డివైడర్ కారణంగా వెంచర్‌లో ప్లాట్లకు డిమాండ్ లేదన్న సాకుతో రాత్రికి రాత్రే డివైడర్‌ను ధ్వంసం చేశాడు. ఎవరైన చేసి ఉంటే ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకునేవారు. వెంచర్ నిర్వాహకుడు టీడీపీ నేత కావడంతో అధికారులకు పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

రెండు దారులున్నా..



డోన్ పట్టణం తారకరామనగర్‌లో నిర్మించిన రోటరీ క్లబ్ పార్కు ఫెన్సింగ్‌ను మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండా తొలగించి టీడీపీ కార్యాలయానికి రహదారిని ఏర్పాటు చేసుకోవడం పట్ల కూడా ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం టీడీపీ కార్యాలయానికి రెండు రోడ్లు ఉన్నా కూడా మూడవ రోడ్డు కోసం ప్రజాధనంతో నిర్మించిన పార్కు ఫెన్సింగ్‌ను తొలగించడం ఎంతవరకు సమంజసమని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


చాకలి తిక్కన్న (ఫైల్)

గోనెగండ్ల: మండల పరిధిలోని బైలుప్పల గ్రామంలో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కూలీ పనులు చేసుకొని జీవించే చాకలి తిక్కన్న (35) మేకల కోసం రేకుల షెడ్డు ఏర్పాటు చేశాడు. ఆదివారం రాత్రి ఆషెడ్డులో కరెంట్‌పడకపోవడంతో స్విచ్ బోర్డు వద్ద ప్లగ్ పట్టుకొని చూస్తుండగా ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌కు గురై కుప్పకూలిపోయాడు. గమనించిన కుమారుడు వెంటనే కరెంట్ ఆఫ్ చేసి చుట్టుపక్కల వారి సహాయంతో చికిత్స నిమిత్తం తెర్నేకల్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచాడు. మృతుడికి భార్య పార్వతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్ద ఆకస్మత్తుగా చనిపోవడంతో వారి రోదనలు చుట్టుపక్కల వారిని కంటతడి పెట్టించాయి.

అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు


గ్రావెల్ తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీడీ

కర్నూలు న్యూసిటీ: ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని మైనింగ్ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ హెచ్చరించారు. హాలహర్వి మండలం అర్ధగేరి గ్రామం జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. దీనిపై ఆయన ఆదేశాల మేరకు సోమవారం అక్కడికి వెళ్లి తనిఖీ చేసినట్లు మైనింగ్ శాఖ ఉప సంచాలకులు తెలిపారు. సర్వేనంబర్ 104–సీలో దాదాపు 470 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తరలించినట్లు గుర్తించామన్నారు. అయితే, ఈమట్టిని అభివృద్ధి కార్యక్రమాలకు తరలించినట్లు స్థానికులు చెబుతున్నారని, వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు సమగ్ర దర్యాప్తు జరపనున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయురాలి ఇంట్లో చోరీ


తెరిచి ఉన్న బీరువా

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయురాలు ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక సంఘపేట వీధిలో నివాసముంటున్న ప్రమీల నంద్యాల మండలం చాపిరేవుల హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. పాణ్యంలో ఉంటున్న తన చెల్లికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆదివారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిపోయింది. సోమవారం ఉదయం ఇంటికి తిరిగి రాగానే తలుపులు తెరచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువాలో ఉన్న 8 తులాల బంగారు ఆభరణాలు, అరకేజీ వెండి వస్తువులు, రూ. 20 వేల నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఒక్క మాత్రతో 'నులి'పేద్దాం!

- ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ
- కర్నూలు జిల్లాలో 6,39,941, నంద్యాల జిల్లాలో 4,29,268 మంది పిల్లలు
- ఇప్పటికే అన్ని విద్యాకేంద్రాలకు మాత్రల చేరవేత
- నేడు జిల్లాలోని 19 ఏళ్ల లోపు పిల్లలకు మాత్రలు పంపిణీ


దొర్నిపాడు కేజీబీవీ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న అధికారులు


నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత(ఫైల్)

కర్నూలు(హాస్పిటల్/గోస్పాడు): మనలో చాలా మందికి చేతులు శుభ్రం చేసుకోవడం అలవాటుండదు. చేతులు శుభ్రం చేసుకోకుండా భోజనం చేయడం వల్ల చేతిపై ఉండే సూక్ష్మక్రిములు కడుపులోకి వెళ్లి అనేక వ్యాధులను కలుగజేస్తాయి. పిల్లలైనా, పెద్దలైనా ఈ సూత్రం ఒకటే. కడుపులోని క్రిములను నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలను ఉపయోగించాలి. ఈ విషయాలను పెద్దయ్యాక ఎలాగూ చాలా మంది చెప్పినా వినరు. అందుకే విద్యార్థి దశలోని పిల్లలకు ఈ విషయాన్ని చెబితే వింటారని వైద్యుల భావన. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఈ నెల 17వ తేదిన ఆల్బెండజోల్ మాత్రలను 19ఏళ్లలోపు విద్యార్థులందరికీ పంపిణీ చేయనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్, వొకేషనల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీలు, చైల్డ్‌కేర్ సెంటర్లు, జువైనల్ హోమ్స్‌తో పాటు బడి బయట ఉన్న పిల్లలు ఉన్నారు. కర్నూలు జిల్లాలో 6,39,941, నంద్యాల జిల్లాలో 4,29,268 మంది పిల్లలు ఉన్నారు. వీరందరికీ ఈ నెల 17వ తేదిన ఆల్బెండజోల్ మాత్రలను అందజేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. ఒకటి నుంచి రెండేళ్ల లోపు పిల్లలకు సగం మాత్ర, ఆపై వయస్సున్న పిల్లలకు ఒక మాత్ర వేసేందుకు ఇప్పటికే మాత్రలను ఆయా విద్యాకేంద్రాలకు పంపిణీ చేశారు. చేతులు శుభ్రం చేసుకోకపోవడం వల్ల చేతుల్లో ఉన్న సూక్ష్మ క్రిములు కడుపులోకి వెళ్లి నులిపురుగులను కలుగజేస్తాయి. అవి మనిషి తిన్న ఆహారాన్ని తింటూ పోషకాహార లోపమున్న వ్యక్తిగా మారుస్తాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మీ గోళ్లను చిన్నవిగా, శుభ్రంగా ఉంచుకోవాలి
- ఎప్పుడూ శుభ్రమైన నీటిని తాగాలి
- ఆహారాన్ని ఎప్పుడూ కప్పి ఉంచాలి
- కూరగాయలు, పళ్లను శుభ్రమైన నీటితో కడగాలి
- మీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- బయట తిరిగేటప్పుడు బూట్లు/చెప్పులు ధరించాలి
- బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేయకూడదు. ఎప్పుడూ మరుగుదొడ్డినే వాడాలి
- ఏదైనా తినకముందు, తిన్న తర్వాత, మరుగుదొడ్డికి వెళ్లి వచ్చిన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి

ఆల్బెండజోల్ మాత్రల డోస్ ఇలా..

నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఏడాది నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు ఆల్బెండజోల్ సగం మాత్ర 200 ఎంజీ) నీటిలో కలిపి తాపాలి. 2 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు 400 ఎంజీ మాత్రను మధ్యాహ్నం భోజనం తరువాత చప్పరించేలా చూడాలి. మింగకుండా వైద్య సిబ్బంది పర్యవేక్షించాలి. శరీరంలోకి ప్రవేశించే పురుగులు మూడు రకాలు. ఏలిక పాములు, నులిపురుగులు, కొంకెర పురుగులు. వీటి నివారణకు ఆల్బెండజోల్ తీసుకోవడం ఒక్కటే మార్గం. దీర్ఘ కాలిక వ్యాధులు ఉన్న వారు కూడా తీసుకోవచ్చు.

వ్యాపించే విధానం

నులిపురుగులు ఉన్న వ్యక్తి చేసిన మల విసర్జన ద్వారా అందులోని గుడ్లు నేలలోకి, తద్వారా తాగు నీరు, గాలి ద్వారా ఆహార పదార్థాలపై చేరతాయి.

వ్యాధి లక్షణాలు

రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం–ఆందోళన, కడుపునొప్పి–వికారం, వాంతులు–విరేచనాలు, బరువు తగ్గడం, తరచుగా ఇన్‌ఫెక్షన్లకు గురికావడం

నిర్మూలన వల్ల ప్రయోజనాలు

రక్తహీనతను నివారిస్తుంది. పోషకాలను శరీరం గ్రహించుకుంటుంది. చదువుపై ఏకాగ్రత పెరుగుతుంది. అంగన్‌వాడీ/పాఠశాల/కళాశాలకు వెళ్లేందుకు ఆసక్తి కలుగుతుంది. పనిచేయగల సామర్థ్యం, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. పరిసరాలలో నులిపురుగుల వ్యాప్తిని తగ్గించి సమాజానికి మేలు చేస్తుంది.

ప్రతి విద్యార్థికీ మాత్రల పంపిణీ



జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖతో పాటు విద్య, ఎస్‌ఎస్‌ఏ, ఐసీడీఎస్, ఇంటర్‌మీడియట్ విద్య, సోషల్ వెల్ఫేర్, మున్సిపల్ శాఖల సమన్వయంతో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాము. ఈ నెల 17వ తేదిన ఆల్బెండజోల్ మాత్రలను 19 ఏళ్లలోపు ఉన్న వారందరికీ మింగిస్తాము. ఆ రోజున మాత్రలు అందుకోలేని వారికి ఈ నెల 25వ తేదీన మాప్ అప్ డే రోజున మాత్రలు అందజేస్తాం. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఆరు నెలలకు ఒకసారి చేపట్టడం వల్ల పిల్లల్లో నులిపురుగులను నివారించవచ్చు.
– డాక్టర్ ఎల్. భాస్కర్, డీఎంహెచ్‌వో, కర్నూలు

అవగాహన కల్పించాం



ఆల్బెండజోల్ మాత్రలను మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత మాత్రమే విద్యార్థులకు ఇవ్వాలి. మాత్రలను చప్పరించడం లేదా నమిలి మింగటం చేయాలి. మాత్రలు తీసుకున్న తర్వాత ఏవిధమైన ఇబ్బందులు ఎదురైనా వెంటనే దగ్గరలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలి. పీహెచ్‌సీపరిధిలోని గ్రామాల్లోని అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను అందించనున్నాం. – కాంతారావునాయక్, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారి, నంద్యాల

పకడ్బందీ ఏర్పాట్లు



ఈ నెల 17న జిల్లా అంతటా ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలకు అందజేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లాలో 4,29,268 మంది పిల్లలకు మాత్రలు అందజేయనున్నాం. నులిపురుగుల నివారణకు ఆల్బె ండాజోల్ మాత్రలు తీసుకోవ డం ఒక్కటే మార్గం. కాలకృత్యాలు తీర్చుకున్న అనంతరం తప్పనిసరిగా చేతులను శుభ్రపరుచుకోవాలి.
– వెంకటరమణ, డీఎంహెచ్‌ఓ, నంద్యాల

అత్యాధునిక పరికరాలతో గుండెజబ్బుల నివారణ


కేక్ కట్ చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): అత్యాధునిక వైద్యపరికరాలు రావడంతో గుండెజబ్బులను ముందుగానే గుర్తించి నివారించగలుగుతున్నామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియాలజి ప్రొఫెసర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ చెప్పారు. సోమవారం అంతర్జాతీయ ఇంటర్వెన్షనల్ కార్డియాలజి డే సందర్భంగా కార్డియాలజి విభాగంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ 1977 సంవత్సరం సెప్టెంబర్ 16న స్విట్జర్లాండ్‌లో డాక్టర్ గ్రున్‌జింగ్ అనే శాస్త్రవేత్త గుండెకు స్టెంట్ వేయడాన్ని కనుగొన్నారని తెలిపారు. ఆయన సేవలకు స్మారకంగా ప్రతి ఏడాది సెప్టెంబర్ 16న ప్రపంచ ఆరోగ్య సంస్థ అంతర్జాతీయ ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజి డే నిర్వహించాలని తీర్మానించిందన్నారు. కార్డియాలజి విభాగంలో గత నవంబర్‌లో నూతన కేథ లాబ్ మిషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. దీని ద్వారా ఇప్పటి వరకు 796 యాంజియోగ్రామ్స్, 291 స్టెంట్స్, 15 టెంపరరీ పేస్‌మేకర్లు, రెండు పర్మినెంట్ పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్స్, రెండు రీనల్ యాంజియోప్లాస్టీ, 9 ఇంటర్‌వెన్షనల్ రేడియాలజి, 19 డిజిటల్ సబ్‌ట్రాక్షన్ యాంజియోగ్రాఫీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్డియాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ కిరణ్, పీజీలు సత్యకుమార్, మహేష్, శ్రీకాంత్, నవాజ్, రవికిశోర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో కర్నూలుకు 3వ స్థానం


కప్పు అందుకుంటున్న జిల్లా యోగా క్రీడాకారులు

కర్నూలు (టౌన్): ఈనెల 14 , 15 తేదీల్లో విశాఖ పట్నంలో నిర్వహించిన 49 వ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు 3 వ స్థానంలో నిలిచింది. 8 నుంచి 10 సంవత్సరాల బాలుర వ్యక్తిగత విభాగాల్లో సాకేత్ (ద్వితీయ స్థానం), బాలికల విభాగంలో రేహా వినూత్న రెడ్డి (ప్రథమ స్థానం), 10 నుంచి 12 సంవత్సరాల బాలుర విభాగంలో మహమ్మద్ అసహాజ్ (మూడో స్థానం), సాకేత్ (నాలుగో స్థానం), బాలికల విభాగంలో మనుశ్రీ (ప్రథమ స్థానం), క్రిష్ణ ప్రియ (తృతీయ స్థానం), 12 నుంచి 14 సంవత్సరాల బాలుర విభాగంలో లికిత్ (తృతీయ స్థానం), సందీప్ (ఆరో స్థానం), 14 నుంచి 16 సంవత్సరాల విభాగంలో ధనుంజయ చౌదరి (ఆరో స్థానం), బాలికల విభాగంలో మనస్విని (ఆరో స్థానం), 16 నుంచి 18 సంవత్సరాల బాలికల విభాగంలో పల్లవి (ప్రథమ స్థానం),ప్రొఫెషనల్ కేటగిరిలో మునుస్వామి (తృతీయ స్థానం) విజేతలుగా నిలిచినట్లు రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వీరంతా వచ్చే నెల హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కోసిగి: మండల కేంద్రం కోసిగి రైల్వే గేటు సమీపంలో ఓ వ్యక్తి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కోసిగిలోని బూళ్లోలి వీధిలో నివాసం ఉంటున్న బలకుంది కోసిగయ్య(52) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మతి స్థిమితం సరిగ్గా లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. సోమవారం మధ్యాహ్నం సమయంలో గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వర రావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతిడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఈఎన్‌టీ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ జయప్రకాష్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఈఎన్‌టీ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కర్నూలుకు చెందిన డాక్టర్ బి.జయప్రకాష్ రెడ్డి ఎంపికయ్యారు. ఈ నెల 13, 14, 15వ తేదీల్లో భీమవరం పట్టణంలో జరిగిన జాతీయ ఈఎన్‌టీ వైద్యుల రాష్ట్రస్థాయి 42వ మహాసభల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత 30 సంవత్సరాలుగా నిరంతరాయంగా రోగులకు సేవలందిస్తూ అత్యాధునిక పరికరాలను ఉపయోగించి క్లిష్టతరమైన శస్త్రచికిత్సలు నిర్వహించానని, తాను నేర్చుకున్న నైపుణ్యాన్ని నూతన వైద్యులకు క్రమం తప్పకుండా శిక్షణ ఇస్తున్నట్లు డాక్టర్ జయప్రకాష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో తనకు రెండు పతకాలు కూడా లభించాయని ఆయన తెలిపారు. చెవిలో చీము కారే రోగులపై అత్యాధునిక పరికరాలు ఉపయోగించి తాను చేసిన శస్త్రచికిత్సల ప్రదర్శనకు డాక్టర్ శివరామ కృష్ణ స్మారక స్వర్ణపతకం లభించిందన్నారు. చిన్నపిల్లల్లో టాన్సిల్స్, అడినాయిడ్స్ సమస్యలపై తాను చేసిన క్లిష్టతరమైన శస్త్రచికిత్సల ప్రదర్శనకు తనకు డాక్టర్ భయ్యా శ్రీనివాసరావు స్మారక రజత పతకం లభించిందన్నారు.

గణేష్ నిమజ్జనంలో అపశ్రుతులు

- ఒకరు మృతి, 61 మందికి గాయాలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలో ఆదివారం నిర్వహించిన గణేష్ నిమజ్జనం కార్యక్రమంలో కొన్ని అపశృతులు చోటుచేసుకున్నాయి. వివిధ చోట్ల 61 మంది గాయపడ్డారు. వీరిలో కొందరికి చిన్న చిన్న గాయాలు, మరికొందరికి ఫ్రాక్చర్లు అయ్యాయి. గాయపడిన వారిని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సత్వర చికిత్స అందించారు. కాగా నగరంలోని పాతబస్తీకి చెందిన క్రిష్ణ(40) ట్రాక్టర్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడగా ఆసుపత్రికి తెచ్చేలోపే ఆయన మృతి చెందారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం నుంచే వైద్యులు, సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి అప్రమత్తం చేశారు. గాయపడి వచ్చిన వారికి వెంట వెంటనే వైద్యం చేస్తూ వచ్చారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన రాపిడ్ రెస్పాన్స్ టీమ్ బాగా చేసిందని డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

హలో.. సీఎంఓ నుంచి మాట్లాడుతున్నా..

- లక్షరూపాయలు పంపించండంటూ జలవనరుల శాఖ అధికారులకు ఫోన్
- సీనియర్ జర్నలిస్టు ఫోరం ప్రెసిడెంట్‌ని అంటూ మరోసారి కాల్
- అనుమానం వచ్చి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఇంజినీర్లు

కర్నూలు సిటీ: మోసగాళ్లు కొత్త అవతారం ఎత్తుతున్నారు. ఏకంగా సీఎంఓ నుంచి మాట్లాడుతున్నానని ఓ వ్యక్తి జలవనరుల శాఖ అధికారులకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడు. అనుమానం వచ్చిన సదరు అధికారులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 14న జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ రెడ్డిశేఖర్ రెడ్డికి ఓ వ్యక్తి ఫోన్ చేశారు. నేను సీఎంఓ నుంచి మాట్లాడుతున్నా, మీ పరిధిలో ఎంత మంది పని చేస్తున్నారు.. వారి పేర్లు, ఫోన్ నంబర్లు కావాలని అడిగాడు. ఉద్యోగుల బదిలీల సందర్భంగా వివరాలు అడుగుతున్నారేమేనని, తన కింద ఐదుగురు ఈఈలు పని చేస్తున్నారని చెప్పగా, ఈఈ రాజశేఖర్‌తో తనకు ఫోన్ చేయించాలని చెప్పాడు. తరువాత రాజశేఖర్ ఫోన్ చేయగా స్పందించలేదు. ఆ తరువాత ఆగంతకుడే ఫోన్ చేసి మీ కింద ఎంత మంది డీఈఈలు పని చేస్తున్నారని ప్రశ్నించాడు. వివరాలు చెబుతుండగా అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ డీఈఈ మోహన్ రావు ఫోన్ నెంబర్ ఇవ్వండని అడిగి తీసుకున్నారు. శనివారం సాయంత్రం 90307 24666 నంబరు నుంచి ఆ ఆగంతకుడు డీఈఈకి ఫోన్ చేసి 'ఇక్కడ అందరు వింటున్నారు.. నువ్వు జాగ్రత్తగా మాట్లాడు' అన్నాడు. అనుమానం వచ్చిన డీఈఈ మీరు ఎవరు అని రెండు, మూడు సార్లు గట్టిగా అడగడంతో ' తాను సీనియర్ జర్నలిస్టు ఫోరం ప్రెసిడెంట్‌నని.. అన్ని జిల్లాల వారు ఇచ్చారు.. మీరు కూడా లక్ష రూపాయలు ఇవ్వాల'ని డిమాండ్ చేశాడు. ఇందుకు సదరు అధికారి తన దగ్గర అంతలేదనడంతో కనీసం రూ.50 వేలు అయినా ఫోన్‌పే చేయాలని చెప్పి తర్వాత ఎంత ఉంటే అంత పంపించమన్నాడు. డీఈఈ అనుమానంతో విషయం ఎస్ఈ, ఈఈ దృష్టికి తెలియజేయడంతో వారు జిల్లా ఎస్పీ బింధు మాధవ్ దృష్టికి తీసుకుపోయారు. ప్రస్తుతం ఈ విషయం జల వనరుల శాఖ కార్యాలయంలో చర్చనీయాంశమైంది. ఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేయనున్నట్లు డీఈఈ మోహన్‌రావు తెలిపారు.

హిజ్రాల ఓవరాక్షన్

- డబ్బులిస్తేనే కదిలేదంటూ భక్తులపై చిందులు
- బస్సు అద్దంపై రాళ్లు రువ్విన హిజ్రాలు


భక్తులతో వాగ్వాదం చేస్తున్న హిజ్రా

మహానంది: మహానంది సమీపంలోని పాలేరు వాగు వద్ద హిజ్రాలు సోమవారం ఓవరాక్షన్ చేశారు. మహానందీశ్వరుడిని దర్శించుకుని వెళ్తున్న ఓ బస్సును ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. భక్తులు వారికి తోచిన మేరకు ఇస్తే కాదు, కుదరదు అని వందల రూపాలయలు ఇవ్వాలంటూ డిమాండ్ చేయడంతో పాటు మహిళలు, చిన్నపిల్లలు ఉన్నారని చూడకుండా అసభ్యంగా ప్రవర్తించారు. అంతే కాకుండా బస్సు అద్దాలపై రాళ్లు రువ్వడంతో భయభ్రాంతులకు గురైన భక్తులు వెంటనే మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డికి ఫోన్ చేసి ఏడుస్తూ సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన హిజ్రాలు పోలీసులు వచ్చేలోపు అక్కడి నుంచి బైకులపై ఉడాయించారు. ఇదిలా ఉండగా ఇటీవల పాలేరువాగు వద్ద పలువురు హిజ్రాలు అధికంగా డబ్బులు ఇవ్వాలంటూ భక్తులతో తరచూ గొడవలకు దిగుతున్నారు. దేవస్థానం, పోలీసు అధికారులు స్పందించి వారి ఆగడాలను కట్టడి చేయాలని భక్తులు కోరుతున్నారు.


ఉద్ధృతంగా ప్రవహిస్తున్న కేసీ కెనాల్‌లో ఇనుప సామగ్రి సేకరణలో యువకులు


భద్రం చిన్నా..

నిలుచుంటే భక్తి.. పడిపోతే భుక్తి

గణనాథుడిని ఆది దేవుడు.. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు అంటారు. ఏటా వినాయక చవితిని పురస్కరించుకుని ఆయనను వాడవాడలా ప్రతిష్ఠించి ఎంతో భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. కర్నూలు నగరంలో నిర్వహించే వినాయక చవితి వేడుకలకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ 9 రోజుల పాటు గణనాథుడిని పూజించి నగరం నడిబొడ్డున ఉన్న కేసీ కెనాల్‌లో పండుగలా నిమజ్జనోత్సవం నిర్వహిస్తారు. ఇంత ఘనంగా జరిపే ఈ వేడుకలో ప్రకృతి సిద్ధమైన మట్టితో చేసిన గణపతి ప్రతిమలు ఏర్పాటుకు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రాధాన్యత ఇవ్వాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పంచభూతాల్లో ఒక్కటైన మట్టితో చేసిన వినాయకుడిని పూజిస్తే అన్ని విధాలుగా మేలంటారు. ఇవి సులువుగా నీటిలో కరుగుతాయి. అదే ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన భారీ గణనాథులను ప్రతిష్ఠించి నిమజ్జనం చేయడం ద్వారా నీరు కలుషితం కావడంతో పాటు జలచరాల మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. ఇదిలా ఉంటే ఇనుప సామగ్రి సేకరణ కొందరికి ఉపాధి కల్పిస్తుండగా ఎంతో భక్తితో పూజించి నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాలపైకి ఎక్కి ధ్వంసం చేసే దృశ్యాలు మాత్రం భక్తుల మనోభావాలను దెబ్బతిస్తున్నాయి.
– సాక్షి ఫొటో గ్రాఫర్, కర్నూలు


నిమజ్జనం చేసినా అక్కడే ఉండిపోయిన భారీ గణనాథుడు



నిమజ్జనం చేసిన విగ్రహాల ఇనుప పీటలు, కడ్డీల కోసం ప్రయత్నిస్తున్న దృశ్యం

